కల నెరవేరేనా?

- పట్టించుకోని బైపాస్ రోడ్డు పనులు
- సత్యవేడులో ట్రాఫిక్ కష్టాలు
- ప్రధాన రహదారిపైనే భారీ వాహనాలు
- హామీలు మరిచిన ప్రజాప్రతినిధులు



సత్యవేడు గాంధీ రోడ్డు టవర్ క్లాక్ మలుపు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఇలా..



మాజీ మంత్రి శివప్రసాద్ అప్పట్లో దాసుకుప్పం బైపాస్ రోడ్డు ఏర్పాటుకు వేసిన శిలాఫలకం

నియోజకవర్గ కేంద్రంలో 25 ఏళ్లుగా బైపాస్ రోడ్డు ప్రతిపాదనలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మాజీ మంత్రి శివప్రసాద్ సమాచార మంత్రిగా ఉన్న సమయంలో సత్యవేడు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు నాబార్డు నిధులు రూ.45 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి హోదాలో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు అప్పట్లో శిలాఫలకం వేశారు. అంతటితో సరి స్థల వివాదం , కాస్త రాజకీయ రంగు పులుముకోవడంతో చివరకు దాని ఊసే మరిచారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు బైపాస్ రోడ్డు వేస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించి గెలిచిన అనంతరం హామీలు తుంగలో తొక్కారు. దీంతో సత్యవేడు ప్రజలకు బైపాస్ రోడ్డు ఏర్పాటు కలగానే మారింది.

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేయడమే ఏకైక మార్గం. సత్యవేడు, దాసు కుప్పంలలో ఎక్కడికి వెళ్లాలన్నా మెయిన్ రోడ్డు ఒక్కటే దిక్కు అయింది. ఈ రోడ్డు ఉదయం, సాయంత్రం తరచూ ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటోంది. వందల సంఖ్యలో లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాటు మండలంలో వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిపోయేవారు, స్కూల్ పిల్లలు, మార్కెట్, తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలు, కోర్టుకు ప్రజలు కార్లు, ద్విచక్ర వాహనాల్లో వచ్చిపోతుండడంతో నిత్యం రోడ్డు రద్దీగా మారింది.

శ్రీసిటీకి భారీ వాహనాల రాకపోకలు

సత్యవేడు మండలంలోని శ్రీ సిటీలోని 200 పైగా కంపెనీలు, అదనంగా కొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భారీ వాహనాలు కంపెనీల నిర్మాణానికి , ముడి సరుకులు సత్యవేడు మీదుగా శ్రీ సిటీకి చేరుతున్నాయి. ప్రధానంగా గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డులో పార్కింగ్ సదుపాయం లేకపోవడం, ద్విచక్ర వాహనాలు , ఆటోలు దుకాణాల ఎదురుగా రోడ్డు సమీపంలో ఉంచుతున్నారు. భారీ వాహనాలు వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.

ప్లాట్‌ఫామ్‌ల ఆక్రమణ

సత్యవేడులో వ్యాపారులు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డులో ఇరువైపులా వివిధ రకాల దుకాణాలు ఉన్నాయి. వ్యాపారులు కొందరు మురుగు కాలువలు, ప్లాట్‌ఫామ్‌లు ఆక్రమిస్తుండడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఉంచాల్సి వస్తోంది. దీంతో తరచూ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా రోడ్డుపై ఆపుతున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో గాంధీ రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు ఎదురుచూస్తున్నారు..



నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సత్యవేడు, దాసుకుప్పంలలో ప్రధానంగా బైపాస్ రోడ్డు అవసరం ఉంది. అధికారులు , ప్రజాప్రతినిధులు గుర్తించి ప్రత్యామ్నాయంగా రోడ్డు వసతి కల్పించాలి. 25 ఏళ్లుగా సత్యవేడు ప్రజలు బైపాస్ రోడ్డు కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

–ఎం.రమేష్, సీపీఎం నాయకులు, సత్యవేడు

ట్రాఫిక్ సమస్య తప్పడంలేదు



మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సత్యవేడులో ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు ఏర్పాటు అవసరం ఉంది. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డే ప్రధానం.

–ఇస్మాయిల్, ద్విచక్రవాహనదారుడు, సత్యవేడు

ఎమ్మెల్యే దృష్టి సారించాలి



నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నా ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరం, సత్యవేడులో ఎక్కడి వాహనాలు అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో సమస్య నెలకొంటోంది. దీనికి తోడు బస్సులు, ఆటోలు ఎక్కువగా నడుస్తుండడం, రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ద్విచక్రవాహనాలు రోడ్లపై ఆపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–ఎల్లయ్య, కేఎస్‌పేట, సత్యవేడు మండలం

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు వీడియో చిత్రీకరణ

సత్యవేడు: సూళ్లూరుపేట ఆర్డీఓ ఆదేశాల మేరకు సత్యవేడు రెవెన్యూ కార్యాలయంలో పాత అడంగల్ల రికార్డులను 28 పంచాయతీల వారీగా వేరుచేసి వీడియో చిత్రీకరణ చేశారు. గురువారం రెవెన్యూ సిబ్బంది గ్రామాల వారీగా అడంగల్ రికార్డులను భద్రపరిచారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఏర్పేడు (రేణిగుంట): ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏర్పేడులో గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు వరి పండిస్తే ప్రభుత్వం రూ.1700 గిట్టుబాటు ధర నిర్ణయించారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రూ.2000కు పైగా గిట్టుబాటు ధర కల్పిస్తే ఈసారి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచి దళారులకు ప్రభుత్వం దోచి పెడుతోందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ.. మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రైతులకు బకాయిలు ఇంకా రూ.30 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఆర్టీసీ జోనల్ చైర్మన్



ఆలయం వద్ద ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు మునిచంద్రయ్య, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు ఫుల్‌డే స్కూల్స్ నడుపుతున్నాయని, అలాగే సెలవు రోజుల్లోనూ పాఠశాలలు నడుతున్నారని చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు జాకీర్, రిజ్వాన్ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

'స్వచ్ఛ' నిర్లక్ష్యం



రేణిగుంట మాతమ్మ గుడి ఎదురుగా ఉన్న కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీలోని అధికారుల నిర్లక్ష్య వైఖరితో స్వచ్ఛ-ఆంధ్ర సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. రేణిగుంట పంచాయతీ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీలోని మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా రేణిగుంట– శ్రీకాళహస్తి రహదారి మాతమ్మ గుడి ఎదురుగా ఉన్న డ్రైనేజ్ లో వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయి మురుగు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతోంది.

గోప్యంగా హుండీ లెక్కింపు?

నారాయణవనం: మండలంలోని కైలాసనాథ కోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును గోప్యంగా నిర్వహించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఆరుమాసాల తర్వాత మంగళవారం ఆలయ హుండీలను తెరిచి కానుకలను ఆహ్వాన కమిటీ, మరికొద్ది మందితో మాత్రమే నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, స్థానికులను సమాచారం అందివ్వకుండా లెక్కింపు ఎలా నిర్వహిస్తారని టీడీపీలోనే మరో వర్గం బహిరంగంగా ఆరోపించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన మునిశేఖర్‌రెడ్డి ఇటీవల మరణించారు. గురువారం ఆయన కర్మ క్రియలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జి వాసుదేవనాయుడు, నాయకులు కోవి చంద్రయ్యనాయుడు, శ్రీరాములురెడ్డి, శ్రీవారి సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, జయశ్యామ్, అల్లూరయ్య, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతే పార్టీకి బలం



సురేష్‌ను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడిగా సురా సురేష్ ఎన్నికైన సందర్భంగా గురువారం తన నివాసంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పునాది యువత పైన ఆధారపడిందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు రాయల్, జయశ్యామ్, మాజీ కౌన్సిలర్ శరవణకుమార్, ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు కొల్లూరు హరినాథ్, మొగరాల గణేష్, ఎం.ఆర్ మురళి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.30 గేట్ రుసుం చెల్లించలేదని దాడి

- ఆటో డ్రైవర్‌కు గాయాలు
- మితి మీరుతున్న గేట్ వసూళ్లు



గాయపడిన ఆటో డ్రైవర్ ప్రసాద్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రూ.30 గేట్ రుసుం చెల్లించలేదని ఆటోడ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన రేణిగుంట రైల్వే స్టేషన్‌లో నెలకొంది. రేణిగుంట రైల్వే స్టేషన్, బస్టాండ్లలో గేటు వసూళ్లు చేసే వారి ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. గేటు వసూళ్లు చేసేవారు వాహనదారులతో అమర్యాదగా మాట్లాడటంతో నిత్యం ఏదో ఒక వివాదం జరుగుతోంది. స్థానికుల కథనం మేరకు... రేణిగుంట రైల్వే స్టేషన్ లో ప్రయాణికురాలు తిరుపతికి వెళ్లేందుకు రాపిడోలో ఆటో బుక్ చేసుకోవడంతో తిరుపతికి చెందిన ప్రసాద్ ఆటో తీసుకొని రేణిగుంట బస్టాండుకు గురువారం రాత్రి 8 గంటల సమయంలో చేరుకున్నారు. ప్రయాణికురాలిని ఎక్కించుకొని తిరుపతికి వెళుతుండగా గేటు వసూలు చేసే వ్యక్తి గేట్ రుసుం చెల్లించాలని లేనిపక్షంలో ఆటోను కదలనివ్వనని అడ్డగించడంతో ఆటో డ్రైవర్ ముందు ఎన్నడూ రేణిగుంటలో గేటు వసూలు లేదని ఇప్పుడు ఎందుకు కట్టాలని ప్రశ్నించడంతో కోపానికి గురైన గేటు వసూలు చేసే వ్యక్తి బీభత్సం సృష్టించి మా ఇష్టం వచ్చినట్టు గేటు వసూళ్లు చేస్తామంటూ దుర్భాషలు ఆడుతూ ఆటో డ్రైవర్‌ను రాయితో కొట్టడంతో డ్రైవర్ తలకు గాయమైంది. సంఘటన స్థలానికి రేణిగుంట పోలీసులు చేరుకొని విచారణ చేస్తున్నారు.

ప్రదోష పూజలు

నాగలాపురం : మండలంలోని శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకిశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మహిళలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని పేద ప్రజలకు ఇళ్లు, స్థలాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్ మాట్లాడుతూ ..గ్రామాల్లో అనేక సమస్యలను పేద ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సమస్యలను పొందుపరుస్తూ వినతిపత్రం ఇచ్చామని, అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే మే నెలలో పేదలకు మద్దతుగా నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య, సీనియర్ నాయకులు వెంకటరమణ, శివానందం, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, కృష్ణ, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్, తారకరామ నగర్ కార్యదర్శి సత్య శ్రీ, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఎల్లమండ్యం నుంచి ప్రధాన రహదారికి వెళ్లే దారిలో కనిపించని సూచిక బోర్డులు

సూచిక బోర్డులు ఏవీ ?

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి–చెన్నై మార్గం మధ్యలోని కేఎల్ఎం హాస్పిటల్ కూడలి సమీపంలోని గ్రామం నుంచి సర్కిల్‌కు వచ్చే క్రమంలో పోలీసులు వన్ వే అని చెబుతూ జరిమానాలు విధిస్తున్నారు. కానీ వన్ వే సూచిక బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయకుండా రాంగ్ రూట్‌లో వచ్చారని వాహనాలకు జరిమానాలు విధించడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండలం ఎల్లమండ్యం నుంచి 100 మీటర్ల దూరం కూడా లేని సర్కిల్లోకి వెళుతున్న వాహనాలను గాజులమండ్యం పోలీసులు ఆపి రాంగ్ రూట్‌లో వచ్చారంటూ భారీ మొత్తంలో జరిమానాలు వేస్తున్నారు. ఎల్లమండ్యం నుంచి ప్రధాన రహదారి పైకి వెళ్లి సర్కిల్లోకి చుట్టుకొని రావాలంటే దాదాపు రెండు కిలోమీటర్లు రావాల్సి ఉంది. వన్ వే అని ఎక్కడా సూచిక బోర్డులు పెట్టకుండా జరిమానాలు విధించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా హోల్కర్ జయంతి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో మరాఠా మాల్య మహారాణి అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్టణానికి చెందిన సామాజిక సమరసతా వేదిక ప్రాంత సాహితీ ప్రముఖ్ దుర్గా ప్రసాద్, తిరుపతి వెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ రేణుదీక్షిత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక నాయకులు పసల వీరస్వామి, అంజూరు బాలసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రంగయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన ప్రశ్నాపత్రాలు



సత్యవేడు ఎమ్మార్సీకి చేరిన ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి ఎస్ఏ-2, సీబీఏ-3, 1 నుంచి 8వ తరగతి వరకు సీబీఏ ప్రశ్నాపత్రాలు, 9వ తరగతికి ఎస్ఏ-2 ప్రశ్నాపత్రాలు జిల్లా విద్యాశాఖాధికారులు పంపించారు. గురువారం ఎంఈఓ రవి, ఎంఈఓ 2-ఉష ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. మండల పరిధిలో 3,544 మంది విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఎమ్మార్సీకి చేరాయని ఎంఈఓ తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

– తప్పిన ముప్పు



రోడ్డుపై పడిన విద్యుత్ తీగలు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం సదాశివపురంలో గురువారం రాత్రి విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌కు గురై తెగి రోడ్డుపై పడ్డాయి. అయితే ఆ సమయంలో అటుగా ఎవరూ వెళ్లకపోవడంతో ముప్పు తప్పింది. విద్యుత్ తీగలు తెగి పడటంతో స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు విద్యుత్‌లైన్‌ను మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న అభిత్రినయని

రేణిగుంట: రేణిగుంట వేణుగోపాలపురానికి చెందిన ఏఈ వెదుళ్లచెరువు వాసుదేవయ్య కుమార్తె అభిత్రినయని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో మొదటి స్థానం సాధించి ప్రశంసా పత్రం, నగదు పురస్కారం అందుకుంది. బెంగుళూరు జైన్ యూనివర్సిటీలో 'గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెటలిసిస్ట్' అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్న అభిత్రినయని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన కెమోస్పియర్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆమెకు ఎస్వీ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, కోఆర్డినేటర్లు శరత్ బాబు, అఖిల చేతుల మీదుగా నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందుకోవడంతో స్థానికులు ఆమెను అభినందించారు.

ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి: రంజాన్ మాసం పురస్కరించుకుని గురువారం పట్టణంలో నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు జీవీఆర్ రెడ్డి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: అందరి సహకారంతో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన నారాయణవనంలో నిర్మించిన కసిమిట్ట సీసీ రోడ్డు, బీసీ కాలనీలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. చేసిన అభివృద్ధి పనులతోనే గుర్తింపు లభిస్తుందని అన్నారు. మంజూరైన నిధులతో పనులను సకాలంలో పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ గుణశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, ఏర్పేడు

రె.క.నెం.58/2025ఎ **బహిరంగ వేలము ప్రకటన** తేది: 27.03.2025

ఇందుమూలముగా యావన్మంది ఏర్పేడు గ్రామ పంచాయతీ ప్రజలకు తెలియజేయడమేమనగా ఏర్పేడు గ్రామ పంచాయతీ నందు షాపింగ్ కాంప్లెక్స్, ప్రైవేట్ బస్టాండ్ మరియు వారపు సంత 2025–2026 సంవత్సరమునకు (01.04.2025 నుండి 31.03.2026 వరకు) రుసుములు వసూలు చేసుకొను హక్కులను మరియు పంచాయతీకి చెందిన షాపింగ్ రూములను నెలసరి అద్దె పద్ధతిపై వ్యాపారము చేసుకొనుటకు గాను **తేది: 03.04.2025 గురువారం ఉ.10గం.లకు** ఏర్పేడు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి వారిచే బహిరంగ వేలము వేయబడును. సదరు వేలము పాల్గొనదలచిన వారు దిగువ పట్టికలో కనిన మేరకు నగదు రూపములో లేక / డిడి రూపములో డిపాజిట్లు చెల్లించి వేలము నందు పాల్గొనవచ్చును.

వ నెం.	వివరము	సర్కారువారి పాట ధర	కాలపరిమితి
01.	రూము నెం. 01 (SC)	15,100	2025–2026 సం.నకు (తేది: 01.04.2025 నుండి తేది:31.03.2026 వరకు)
02.	రూము నెం.03 (SC)	5,700	
03.	రూము నెం.04	13,400	
04.	రూము నెం. 05 (BC మహిళ)	26,100	
05.	రూము నెం.06	28,200	
06.	రూము నెం. 07	30,000	
07.	రూము నెం.08	21,200	
08.	రూము నెం.09 (SC)	21,500	
09.	రూము నెం.10 (ST)	15,900	
10.	రూము నెం.11	31,200	
11.	రూము నెం.12	32,300	
12.	రూము నెం.13	27,200	
13.	రూము నెం.14	20,200	
14.	రూము నెం.15	31,100	
15.	రూము నెం.16 (SC)	10,100	
16.	రూము నెం.17 (BC)	19,300	
17.	రూము నెం.18	24,200	
18.	రూము నెం.19	18,300	
19.	రూము నెం.20	30,200	
	శ్రీకాళహస్తి-తిరుపతి పెద్దపేట (యూనియన్ బ్యాంక్ ఎదురుగా)		
20.	రూము నెం.21	19,200	
21.	రూమునెం. 22	17,700	
22.	రూము నెం.23	17,700	
23.	రూము నెం.24	17,700	
24.	రూము నెం.25 (SC)	2,300	
25.	రూము నెం.26 (ST)	2,300	
	మిద్దెపైన రూములు		
26.	రూము నెం.27	3,600	
27.	రూము నెం.28	5,100	
28.	రూము నెం.30	5,100	
29.	రూము నెం.31	5,100	
30.	రూము నెం.32	5,100	
31.	రూము నెం.33	3,600	
32.	రూము నెం.34	3,600	
33.	బస్టాండు (BC) సంవత్సరానికి	1,58,200	
34.	వారపు సంత 1 సంవత్సరానికి (BC) మహిళ	60,200	

దరఖాస్తు తేది :02.04.2025, సమయము: ఉ.10 గం.ల నుండి సా.5 గం.ల వరకు. వేలము షరతులు: [illegible]

ఎస్. శివయ్య, సర్పంచ్, ఏర్పేడు గ్రామ పంచాయతీ | [illegible], పంచాయతీ కార్యదర్శి, ఏర్పేడు గ్రామ పంచాయతీ | [illegible]